20012025-DIS-04_Layout 1 1/20/2025 2:30 AM Page 1




# చె లి మె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com

## కవులకూ ఇమేజ్ సమస్య!

తెలుగు సాహిత్యం ఏ తరహా విమర్శను కోరుకుంటున్నది? పొగడ్తను మాత్రమే కోరుకుంటున్నదా? సహేతుకమైన విమర్శను జీర్ణం చేసుకో లేకపోతున్నదా?



**ఒకప్పుడు ఎంత పెద్ద సాహిత్యకారుడినైనా చీల్చి చెండాడిన ప్రసేన్ ఇప్పుడు ముందుమాటలుగా సాహిత్య ప్రశంస చేస్తుంటే కొందరికి అది నచ్చడం లేదు. సూటిగానే మీరు మారారని ప్రసేన్‌తోనే అంటున్నారు. మరోవైపు నీలిమ వి.ఎస్.రావు ఈ మధ్య కొంత నెగెటివ్ విమర్శ రాస్తున్నది. ఆమె రాతలను అందరూ ఎందుకంత దూకుడు, అంత విమర్శ అవసరమా అని ఆమెతోనే అంటున్నారు.**

మరోవైపు తాడి ప్రకాష్ రాతలనూ అందరూ మెచ్చుకుంటున్నారు. నిజానికి ఆయన ఏది రాసినా అది కేవలం ప్రశంస. అయితే అది మంచి స్టైలింగ్‌తో ఉంటుంది కనుక మెచ్చుకుంటున్నారు. ఇంకోవైపు అదే రకం స్టైలింగ్‌తో తన వాదనను సోదాహరణంగా సమర్థించుకుంటూ రాసే నున్నా నరేష్ రాతల మీద సాహిత్య లోకానికి మహా మంట. ఇంకింకోవైపు ఎవరినీ పల్లెత్తు మాట అనని గుంటూరు లక్ష్మీనరసయ్య, సీతారాంలను గొప్ప విమర్శకులుగానే చూస్తున్నది సాహిత్య లోకం. మళ్లీ అదే ప్రశ్న తెలుగు సాహిత్య లోకం ఏం కోరుకుంటున్నది. కేవలం ప్రశంసనా, విశ్లేషణాత్మక విమర్శ అవసరం లేదనుకుంటున్నదా?

'మీరు ఈ మధ్య మరీ సాఫ్ట్‌గా రాస్తున్నారు. ఇంతకుముందున్న దూకుడు తగ్గింది' అని అడిగాడొక మిత్రుడు, ఇటీవల జరిగిన హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌లో తోపుడు బండి సాదిక్ వేదిక దగ్గర. అడిగింది నన్ను కాదు, కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్‌ని. అప్పుడు ప్రసేన్ పక్కనే ఉన్నాన్నేను. 'ఆటా పాటా తానా తందానా' లాంటి విమర్శ చేసిన 'ప్రసేన్ మీరేనా అని డౌట్ కూడా వస్తుంది' అన్నాడు. దానికి ప్రసేన్ 'తెలుగు సాహిత్యం ఏమి కోరుకుంటున్నదో అదే నేను ఇస్తున్నాను' అన్నాడు. గమ్మత్తేమిటంటే అదే వ్యక్తి 'ఏంటండీ ఈ మధ్య నీలిమ గారు మరీ అంత దూకుడుగా రాస్తున్నారు కొంచెం తగ్గించమని చెప్పండి' అని నాతో అన్నాడు. అతను నాకు తెలుగు సాహిత్యం ప్రతిబింబంలా అనిపించాడు. ఆ సంభాషణ అంతటితో ముగిసిపోయింది, నాలో ఒక ప్రశ్నను వదిలి. ఈ ప్రశ్న నా ఒక్కడిదే కాదు. తెలుగు సాహిత్యాన్ని సన్నిహితంగా పరిశీలిస్తున్న వాళ్లందరిదీ.

'తెలుగున సాహిత్య విమర్శా దీపము బహు చిన్నది' అన్న కట్టమంచి రామ లింగారెడ్డి మాటల్ని మనం తరచూ ఉటంకిస్తుంటాం. ఉన్న ఆ చిన్న దీపం కూడా కొడిగట్టిపోయే స్థితి వచ్చిందేమో అనే సందేహం కలిగినట్టుంది, అందుకే అకాడమీలో బాధ్యతాయుత స్థానంలో ఉన్న ప్రసేన్‌ని ఆ ప్రశ్న వేసినట్టున్నాడు. ముందు మాటలకు, బ్లర్బ్‌లకు కొన్ని పరిమితులుంటాయి కనుక కొంత ప్రశంస తప్పిస్తే అభిశంసన ఉండటం లేదు. నిజానికి ముందుమాటలో విమర్శ చేయకూడదని ఎక్కడా లేదు. చాలా ముందు మాటలు గొప్ప విమర్శగా పేరు తెచ్చుకున్న సందర్భాలూ ఉన్నాయి. అయినా ముందు మాటల్లో అంశాలకు కొంత కుషన్ ఇచ్చినా ఇతరత్రా విమర్శలో కూడా ప్రశంస తప్పితే గుణ, దోష వివరణో, నిర్మాణ వైఫల్య సాఫల్యాలను విప్పిచెప్పడమో, దృక్పథ లోపాన్ని చెప్పడమో, భాషా పరంగా తప్పొప్పులను ఎత్తి చూపడమూ ఎక్కడా జరగడం లేదు. దానికి ప్రధానంగా బాధ్యత వహించవలసింది మాత్రం సృజనకారులు, విమర్శకులు మాత్రమే తెలుగు నాట ఉన్న విమర్శకులు కొద్దిమంది. ఆ కొద్ది మంది కూడా చాలా సేఫ్ గేమ్ ఆడుతున్నట్టు అనిపిస్తున్నది చూస్తుంటే.

**కవుల, రచయితల గుడ్ లుక్స్‌లో ఉండాలని విమర్శకులు ప్రయత్నం చేయడం ఎందుకు? ఇంతకుముం దు రారా, కేవీఆర్, చేరా, పురాణం, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, జయప్రభ, రంగనాయకమ్మ, వెల్చేరు ఇలా ఎవరూ సేఫ్ గేమ్ ఆడలేదు. ఉన్నది ఉన్నట్టు కుండబద్దలు కొట్టేవారు. ఇప్పుడు అలా లేదు.**

కానీ, ఇప్పుడలా ఉన్నదా? ఇప్పటి విమర్శకులు అందరిలోకి అగ్రగణ్యుడు లక్ష్మీనరసయ్య కవులను ప్రశంసించాల్సి వస్తే పేర్లు పెట్టి మరీ ప్రశంసిస్తారు. కానీ, విమర్శించాల్సి వచ్చినప్పుడు మాత్రం స్వీపింగ్ కామెంట్స్ చేసి వదిలేస్తారు. చాలాకాలం కిందట శేషం లక్ష్మీపతిరావు సాహిత్యంలో రిజర్వేషన్ అని ఒక వ్యాసం రాశారు. అందులో ప్రధాన అంశమేమంటే మార్జినలైజ్ వర్గాల నుంచి వస్తున్న సాహిత్యాన్ని అంచనా వేసేటప్పుడు ప్రధాన స్రవంతి సాహిత్యకారుల వివేచనా పద్ధతులను, లేదా విమర్శా సూత్రాలను యథాతథంగా ఉపయోగించకూడదు. కొంత కుషన్ ఇచ్చి అంచనా వేయాలి. లేకపోతే సాహిత్య వివేచనలో అసమతుల్యత పెరిగిపోతుంది. కొత్తగా గొంతు విప్పుతున్నారు కనుక వాళ్ల పట్ల విమర్శ మరింత కఠినంగా ఉండకూడదు. ఈ వ్యాసాన్ని లక్ష్మీపతిరావు అస్తిత్వ ఉద్యమాలు పురులు విప్పుకొంటున్న దశలో అంటే 20వ శతాబ్దపు చివరి దశకంలో రాశారు. 21వ శతాబ్దం వచ్చి రెండున్నర దశాబ్దాలు గడిచినా ఇంకా కుషన్ ఇవ్వాలని లక్ష్మీనరసయ్య ఇప్పటికీ అనుకుంటున్నట్టుంది. స్త్రీవాద, దళిత, ముస్లిం మైనారిటీ, ఆదివాసీ కవిత్వం తెలుగులో చాలా బలంగా వేళ్లూనుకున్నది. ఇప్పటికైనా సరైన విమర్శ చేయకపోతే అది తెలుగు సాహిత్యానికి నష్టం.

దళిత కవిత్వం రాస్తున్న కవులను లక్ష్మీనరసయ్య పొగడటం తప్పిస్తే వాళ్ల లోపాలు చెప్పరు. కవులకు కూడా అదే కావాలి కనుక లక్ష్మీ నరసయ్య వెనుక కోడిపిల్లల్లా తిరుగుతూ ఉంటారు. అలా తిరగటం పట్ల నాకేమీ అభ్యంతరం లేదు. ఇంతకుముందు చేరా చుట్టూ కూడా అలాగే కవులు తిరిగేవారు. అయినా చేరా మొహమాటపడలేదు. త్రిపురనేని శ్రీనివాస్ రహస్యోద్యమం మీద చేరా విమర్శ, త్రిపురనేని జవాబులు కొంచెం వెనక్కి వెళ్తే ఎవరైనా చదువుకోవచ్చు. చివరికి దాశరథి కూడా 'చేరాతలు, తల రాతలు మారుస్తాయా' అన్నారు. రా రా మీద విరుచుకుపడ్డ కవులకు లేక్కే లేదు. అయినా వాళ్లెవరూ విమర్శను దేనికోసమో డైల్యూట్ చేసి ప్రశంస మాత్రమే విమర్శ అనలేదు

తెలుగు నాట తాజా సంచలనం తాడి ప్రకాష్ కూడా వాక్య విన్యాసంతో మెస్మరైజ్ చేస్తారు. మోహన్ గురించి రాసినా, ఇతర సాహిత్యకారుల గురించి రాసినా, సినిమా గురించి రాసినా, ఎక్కడా ఒక్క నెగెటివ్ మాట రాయరు. సుంకర గోపాల్, రాధేయ, కవి సంగమంలో వ్యాసాలు రాసే లెక్కకు మిక్కిలి కవులు ఎవరూ ఒక నెగెటివ్ మాట రాయరు. ఫణి మాధవి, రాజేశ్వరీ రామాయణం, బిల్లా మహేందర్, మెట్టా నాగేశ్వరరావ్ తదితర కాలమిస్టులు కూడా ఎవ్వరినైనా పొగడటమే తప్ప పల్లెత్తు మాట అనరు. కానీ, ఒక సాహిత్య మిత్రుడు వచ్చి మీరెందుకు మరీ అంత సాఫ్ట్‌గా రాస్తున్నారు అని పాతకుడు అడుగుతున్నాడు. మనమేం జవాబు చెప్తాం.

**అసలైన అర్థంలో విమర్శ చేస్తే ఏం జరుగుతున్నది?: ఇటీవల నీలిమ వీఎస్ రావు రాస్తున్న వ్యాసాలకు వస్తున్న స్పందన ఏం జరుగుతున్నదో స్పష్టంగా చెప్తున్నది. గాంధారి వానలో దళిత కవిత్వం ఉండవలసిన ఇంటెన్సిటీ, డెన్సిటీ ఉండవలసిన రీతిలో లేదన్నందుకు ఆమె మీద వెర్బల్‌గా దాడి చేసినంత పనిచేశారు. వాక్యాన్ని ఎక్కువ మెటఫరైజ్ చేయడం ఎలా లోపమైందో నీలిమ చెప్పినందుకు ఆమెను కవిత్వం చదివి రాయండన్నారు. అంటే విమర్శకుడు పుస్తకం చదువకుండానే రాస్తాడా?**

ఒక కథ బాగాలేదని ఎవరైనా అంటే ఆ బాగా లేదని అన్న వాళ్లకు కథ అర్థం కాలేదు అనటం, కథ చదవటం నేర్చుకోమని సుద్దులు చెప్పటం, ఆ రచయిత బలవంతుడైతే తన అనుయాయులతో దాడి చేయించడం, ఫోన్‌చేసి తూలనాడటం ఇవాళ కొత్తగా మొదలైన పద్ధతులు. సాహిత్యానికి ఇవి మంచివి కావు. సినిమా హీరోలని తెలుగు కవులు, రచయితలు అనుసరిస్తున్నారనుకుంటాను. వాళ్లలాగే వీళ్లకీ ఇమేజ్ ప్రాబ్లమ్ ఏమైనా ఉందా?



వంశీకృష్ణ
9573427422

## సబ్బండ వర్ణాల నుడి వుప్పల



**అతను ఒక మండుతున్న కొలిమి.
అతనొక నిండు చెరువు.
అతనొక చౌరస్తా.
అతనొక కూలీల అడ్డా.
అతను ఒక పూలు, పండ్ల వనం.
సబ్బండ వర్ణాల వాణి.**

**వుప్పల నరసింహంను వీటిలో ఏదో ఒక వ్యక్తీకరణకు పరిమితం చేయలేం. ఎందుకంటే ఆయన అన్నింటి సమాహారమైన సాహితీ సేద్యగాడు. సహజ వ్యక్తీకరణలతో ఆయన కలం మూసీనదిలా ప్రవహించింది. పల్లెల్లో అమ్మలు ముగ్గేసినట్టు.. సేలల్లో నాట్లేసినట్టు.. కలుపుదీసి కోతలు కోసినట్టు.. కోడిపుంజులు కొట్లాడినట్టు.. గొర్రె పొట్టేళ్లు ఢీకొన్నట్టుగా ఉంటాయి అతని ముచ్చట్లు. ఆయన కథ, వ్యాసం, కవిత్వం, నాటకం ఏది రాసినా తెలంగాణకు నిలువెత్తు దర్పణమే.**

తెలంగాణ భాషలో రాయడమే కాదు, అదే ఊపిరిగా జీవించాడు. సామాన్యుల వ్యవహారాలు, అలవాట్లను, వ్యవసాయాధారిత కులవృత్తుల జీవన విధానాన్ని, వృత్తి కళాకారులు, ఉపకులాల, సంచార తెగల కళలన్నింటినీ తెలుసుకొని అక్షరీకరించారు. కథల రూపంలో మనకందించారు. నిత్య జీవితంలో కింది కులాల తండ్లాటను చూపేందుకే తన కలాన్ని ధారవోశారు. కూలిపోతున్న కుల వృత్తులను, విస్మృతుల సాంస్కృతిక చరిత్రను విస్తృతంగా బయలుపరిచారు. తనది తయిద అంబలి, జొన్న సంకటి, సద్దరొట్టెల భాష. గంజి యాస. దాపరికం లేని మనిషి, ఏదీ దాచుకోలేని మనిషి. అందుకే ఏ సంఘం జట్టులో చేరని మనిషిగా మిగిలిపోయారు. ఎవరినీ కలువని మనిషి. అంతర్ముఖంగా అక్షరాలను ఆలింగనం చేసుకొని తెలంగాణ కుల వృత్తుల ముచ్చట్లను అందించారు. ఏ కాలంలోని పద సంపదలు ఆ కాలంలోనే అంతరించిపోకూడదనే సంకల్పంతో ప్రతిదీ రికార్డు చేయాల్సిన బాధ్యత ఉన్నదని, ఆ సంకల్పాన్ని భుజానికెత్తుకున్నారు వుప్పల.

1955లో రంగారెడ్డి జిల్లా దేవరయాంజాల్‌లో వుప్పల నరసింహం జన్మించారు. అక్కడే ఉన్నత పాఠశాల విద్య. విద్యార్థి దశలోనే రాత్రి పాఠశాలను ఏర్పాటుచేసి గ్రామీణులకు అక్షరసేద్యం చేశారు. అనంతరం తెలంగాణ పల్లెల్లో విస్తృతంగా తిరుగుతూ ప్రజల్లో చైతన్యం కలిగించే అనేక కార్యక్రమాలు చేపట్టారు. 'ఆర్ట్ లవర్స్' సంస్థతో కలిసి అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కవిత్వంతో పాటు కథలను, వ్యాసాలను విస్తృతంగా రాశారు. మావోయిస్టు సిద్ధాంతానికి వ్యతిరేకంగా 40 పుస్తకాలను ప్రచురించారు.

'తిరగబడ్డ భూమి', 'ముద్ర', 'ఎర్ర లైటు' సంపుటాలను కలిపి 'మట్టిమనిషి-వుప్పల నరసింహం కథలు సంపుటిగా వెలువరించారు. నలుగురు తెలంగాణ రచయితలతో కలిసి పి.యశోదారెడ్డి, వుప్పల నరసింహం, ముదిగంటి సుజాతరెడ్డి, కాసుల ప్రతాపరెడ్డి కథలను చౌరస్తా సంకలనంగా తీసుకొచ్చారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వైపై తెలంగాణ మాసపత్రికకు సంపాదకత్వం వహించారు. నూతలపాటి గంగాధరం అవార్డును అందుకున్నారు. కథావేదిక, నటన సంస్థలను స్థాపించి ఇటు కథకు, అటు నాటకరంగానికి అనేక సేవలందిస్తూ ఉద్యమంలా పనిచేశారు. రెండు చలనచిత్రాలకు పనిచేశారు. మూడు డాక్యుమెంటరీలు తీశారు. అందులో ఒకటి ప్రముఖ కథకుడు మునిపల్లె రాజు మీద రూపొందించారు. రచయితగా తెలంగాణ సాహిత్యానికి విశిష్ట సేవలందిస్తున్న వుప్పల నరసింహంను ఉత్తమ కథా రచయితగా గుర్తించి తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి లక్ష రూపాయల నగదు పురస్కారంతో గౌరవించి సన్మానించారు.


వుప్పల నరసింహం రచన ముద్రకు ప్రముఖ కథకులు మధురాంతకం రాజారాం రాసిన ముందుమాటలో గోలకొండ పైన తెలుగు జెండా ఎగరేసిన సురవరం ప్రతాపరెడ్డెన్న ఎక్కడైతే వుంటాడో, పదునెక్కిన కలంతో ప్రజల పోరాటాల్ని చిత్రించిన ప్రజల మనిషి వట్టికోట ఆళ్వారుస్వామి ఎక్కడైతే వుంటాడో, గడీల్లోని దొరల దురాగతాల్నీ చీల్చి ఎండగట్టిన దాశరథి రంగాచారి ఎక్కడైతే వుంటాడో, చదువర్లకు తెనుగు తియ్యదనాలు సామెతలుగా పెట్టిన యశోదమ్మ ఎక్కడైతే వుంటుందో, సెగలు గక్కుతా రవ్వలు చిమ్ముతా కొలిమంటుకున్నదని చెప్పిన అల్లం రాజయ్య ఎక్కడైతే ఉంటాడో, అక్కడ – ఆ సాహిత్య చరిత్రలో వుప్పల నరసింహం ఉంటాడని అంటారు మధురాంతకం రాజారాం ముద్రకు రాసిన ముందుమాటలో. జర్నలిస్టుగా ఆంధ్రజనత, ఆంధ్రప్రభలో పనిచేశారు. వివిధ పత్రికల్లో 40 ఏళ్లుగా కాలమ్స్ రాశారు. 1998 1999లో ఆంధ్రప్రభ ఆదివారం సంచికలో యాసపీఠం' శీర్షికన కాలమ్ రాశారు. ఆయన రాసిన ముచ్చట్లన్నీ దళితబహుజనులవే.. నిరంతరం రచనావ్యాసంగంలో మునిగితేలే వుప్పల నరసింహం నవంబర్ 14న హైదరాబాద్ లోని స్వగృహంలో గుండెపోటుతో కన్నుమూశారు. తెలంగాణ ఆయువు పట్టయిన నుడికారాలను పలుకుబడులను పట్టుకున్నారు. ఎన్నో కథలు తవ్వి తీసి రాసిపోశారు. తెలంగాణ పలుకుల భోషాణంలోని మణులు, కెంపులు, రతనాలు, వజ్రాలు, జిగేల్ జిగేల్ మనేలా రాసిన నిండైనమెండైన కవి, కథకుడు వుప్పల నరసింహం.



వనపట్ల సుబ్బయ్య
94927 65358

(ఈనెల 21న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వుప్పల నరసింహం యాదిలో సంస్మరణ సభ జరుగుతున్న సందర్భంగా...)

## ఖాళీ కావాల్సిన సందర్భాలు



ఉన్నట్టుండి నా పుస్తకాల అల్మారా నుండి
పుస్తకాలు మాయమౌతున్నాయి
ఏ అదృశ్య దేవతల పనో మరి!
అవి వట్టి కాగితపు రాశులు కావు
నా చేతి ముద్రలు తాకి
బరువెక్కిన పుటలు
అక్షరాలు రాల్చిన కన్నీటి చెలిమెలు
హృదయం పగిలిన చప్పుళ్ళు
భరించిన పుటలు
పుక్కిటి పురాణాలు కావు
కనిపించని అరణ్యాలు
కురిసిన ఎడతెగని వర్షాలు
దారితప్పిన వాగులు
మరచిపోయిన వసంతాలు
హోరున కుదిపేసే
గాలి తుపాన్‌లు ఒక్కొక్కటిగా
జారిపోతున్న అడుగులు
విరిగిపడిన కెరటాలు
కటిక రాత్రుల్లో
వెలిగిన నక్షత్రాల తీగెలు
ఇప్పుడెక్కడికి
పయనమయ్యాయి
ఈ పూల తెమ్మెరలు
నన్ను ఇలా ఒంటరిని చేసి
ఏ మేఘాలు తీసుకెళ్ళిన
ఒదిగిన నీటి బిందువులు
కళ్లజోడు కోసం
వెతుకుతున్న నాకు
ఆ గదిలో ఒక్కసారి
గుల్‌మొహర్ పూలవర్షం కురిసి
నట్టు
కనిపించని సెలయేళ్లు పారుతున్నట్టు
పోగొట్టుకున్న వసంతాలు తిరిగి వచ్చినట్టు
నా కళ్ళద్దాల పైన పేరుకున్న
దుమ్మును తుడిచాయి
అన్నెఫ్రాంక్ డైరీ పుస్తకంలో
కొత్త గుర్తులు...
నా పూల కొమ్మను
సుతారంగా తెంపుకున్న
అదృశ్య బాలదేవత నా ఇంట్లోనే
నడయాడుతున్నదని
నా వాకిట్లోనే ఇంద్రధనస్సు తచ్చాడుతున్నదని
ఒక సతత హరిత వనం
లోగిలిలోనే పెరుగుతుందని తెలిసాక
బహుశా అల్మారాలు ఖాళీ అయినట్టు
మన మనసు పొరలు ఖాళీ కావాలని..
కొత్త చూపు, కొత్త దారి కోసం...



డాక్టర్ సుంకర రమేశ్
9492180764

**సినిమాల మీద తెలుగులో పుస్తకాలు సహజంగా తక్కువ. ఫిలిమ్ స్టడీస్ స్థాయి పుస్తకాలు ఇంకా తక్కువ. ఇటీవలి కాలంలో సినిమా పుస్తకాలు రావటం పెరిగింది. చాలావరకూ సినిమా రివ్యూలు, సినిమా చరిత్ర, నటీనటుల జీవితాల గురించి, గొప్పగా విజయవంతమైన సినిమాల గురించి వచ్చాయి. తెలుగు వారి జీవితంలో సినిమా ఒక భాగం. కానీ, ఏ సినిమా పుస్తకం కూడా జీవితం గురించి, మనిషి అనే ఆలోచన గురించి చెప్పలేదు.**

## మనస్తత్వ చిత్రణం

కానీ, అలాంటి పుస్తకం తెలుగులో ఒకటి కొంతకాలం క్రితం వచ్చింది. నూతన రచయిత గీతాచార్య రాసిన కొరియానం (పుస్తకం మీద Querryయానం అని కూడా ఉంది). మొదట ఒక వెబ్ మ్యాగజైన్‌లో వచ్చి సక్సెస్ చూసింది. చదివిన వారికి అందులో ఉన్న మ్యాజిక్ తెలిసింది. కేవలం కొరియన్ సినిమాల గురించే కాదు, ఆ సినిమాలలో లోటుపాట్లు, నటీనటుల పరిశ్రమ, దర్శకుల ఆలోచనలతో పాటు హ్యూమన్ సైకాలజీ చాలా చక్కగా విశ్లేషించారు రచయిత.





ప్రఖ్యాతిగాంచిన వెంజన్స్ ట్రైలజీలో ఓల్డ్ బాయ్ సినిమాతో మొదలుపెట్టి మనిషి ఆలోచనలు ఏ సందర్భంలో ఎలా ఉంటాయి, కోపం ఎందుకు వస్తుంది, పగ ప్రతీకార వాంఛలు ఎలా మొదలవుతాయి? వాటిని ఆపటానికి ఏమి కావాలి? ఏమి చేయాలి? ఇలాంటి ప్రశ్నలు రేకెత్తించటమే కాదు, పుస్తకం చదవటం ముగిసేసరికి వాటికి సమాధానాలు-పరిష్కారాలు మనకే తోచేలా చేస్తారు రచయిత. ఇంత సీరియస్ విషయాలను ఆద్యంతం ఫన్, వ్యంగ్యం, ప్యారడాక్స్, విట్ వాడుతూ సరదాగా కథనం ఉండేలా రచయిత తన ప్రతిభ చూపారు. ఇక ఈ పుస్తకంలో 82 లిటరరీ టెక్నిక్స్ వాడటం, అన్ని జానర్లు ఉండటం రచయితకు సినీ సాహిత్యం మీద ఉన్న మమకారం, పట్టు తెలుపుతాయి. చాలా జాగ్రత్తగా ఆస్వాదిస్తూ చదవాల్సిన పుస్తకం కొరియానం.

బోనస్‌గా 62 గొప్ప కొరియన్ సినిమాల గురించి, తెలుగు సినిమాల గురించి కొరియన్లు ఎలా ఆలోచిస్తారు, కొరియన్ వేవ్ ఎలా ఆరంభమైంది.. ఇవన్నీ ఈ పుస్తకం చదవడం ద్వారా తెలుసుకోవచ్చు.

- జయంత్ గట్టినేని
91009 38524

## రచనలకు ఆహ్వానం

**ఉగాది** పర్వదినం సందర్భంగా.. బాలల్లో సాహిత్యాభిరుచిని పెంపొందించి, తద్వారా వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలనే ఉద్దేశంతో సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల నుంచి కథలను ఆహ్వానిస్తున్నాం. ప్రథమ బహుమతి రూ.1,500, రెండు ద్వితీయ బహుమతులు రూ.1.000, మూడు తృతీయ బహుమతులు రూ.500, రూ.300 చొప్పున 12 ప్రత్యేక బహుమతులున్నాయి. ఈ బహుమతులను ఓయూ విశ్రాంత ఆచార్యులు మర్పడగ చెన్నకృష్ణారెడ్డి అందించనున్నారు. హామీ పత్రంతో పాటు విద్యార్థులు తాము రాసిన కథలను కన్వీనర్, ఉగాది కథల పోటీ, ప్రతిభ డిగ్రీ కళాశాల, మెదక్ రోడ్ సిద్దిపేట-502103 చిరునా మాకు 2025 ఫిబ్రవరి 5వ తేదీలోగా పంపగలరు. వివరాలకు 99590 07914ను సంప్రదించండి.

- **భైతి దుర్గయ్య**, (కన్వీనర్, సుగుణ సాహితీ సమితి)



## నింగి నేల నా దేశం

పరుగుల నది ఒకటి చూద్దామని
కన్నుల కాయల్ని
వెంటేసుకుని నడక ప్రారంభం
దారి పక్క నుండి
పూల వాసన హాయినిచ్చింది
మనుషులను పశుగణాలను
దాటుతూ నడక

చూపులకందని భావాలు ఒదిగి
ఆఘ్రాణింపులు మనసువీ అవుతాయి
ఇంతలో...
ముక్కుపుటాలదిరే
బురద కంపు వేదన అవుతుంది
గమ్యం తప్పని గమనం
నా దృష్టి అంతా కొత్త సమత్వ
ఫలాల అన్వేషణ కోసమే

రాళ్లపై కాళ్లు పడ్డాయేమో
బెణుకులు..
తూలి పడబోయి
నిభాయించుకుంటూ నడక..
పాదముద్రల ముద్రితాలను స్మరిస్తుంటే
కొన్ని సన్నివేశాలు
గుండె చెరువు బాతుల
గుంపుల విహారమవుతాయి

ఎన్ని కాళ్ళు నడిచినవో ఈ దారిపైన!
పసిరిక వన్నె వరి
పొలాలు తలలూపే నేలలు
చౌడు భూములు... మైదానాలు...
పచ్చని తలలాడించే గట్టులు గుట్టలూ
ఒకటా రెండా?
సాగర పర్యంతం పయనించినవి

పొలమారిన జ్ఞాపకాలు
ఆకాశం ఎత్తు ఎత్తుగా
పూలు రాలిన నేల
విలువల ప్రతినిధి అయ్యి
ఈ మట్టి పరిమళాలను జతకట్టింది

నిమగ్నత ప్రకాశమానమై
నాకు ఫలదృశ్యంగా కనిపించింది
నా చూపులనల్లుకున్న తీవకు
రంగురంగుల పువ్వులు
మువ్వన్నెలవుతున్నవి

నేను దర్శించింది
నది నవ్వుల నీటి జాలును
జలజలా గలగలా
నాదాలై వాదాలై నడుస్తూనే ఉన్నది

నా దేశం
నిరంతర స్వేచ్ఛా ప్రవాహ సందోహమే!
నా దేశం
కీర్తి వర్ణాల శోభితం

నేను పైకెత్తిన
త్రివర్ణ తత్వ స్వచ్ఛతనే
నింగి నేల నా దేశం
కలల అలల జీవనది

స్వేచ్ఛా సమానత్వ చేతనం
నా భారత దేశ అస్తిత్వకేతనం!!



కొండపల్లి నీహారిణి



## తలుపు గూడు

అది గూడు కాదు
అమ్మమ్మ పావురం నింపుకున్న పొదివి
ఏడాదికో మారు వచ్చే
మనవళ్ల కోసం దాచే తాయిలాల గది

అందులో దాచేవి వెల లేనివే
కొత్త రుచుల జాడ ఆ నాలుగు అరలు
పెద్దోళ్ళ జిహ్వ చాపల్యానికి
తాళంతో సంకెళ్ళు వేయబడే చోటు
తాళం చెవి పుస్తెకి జోడుగా

జోరుగా హుషారుగా అమ్మమ్మ దరి చేరగా
సరాసరి ఆ గూడు తలుపులు
తెరవ సాగే అమ్మమ్మ
అందులోంచి ఏది ఇచ్చినా రుచే
మాగిన ప్రేమ ఫలం నోట్లో
మనసు రెక్కలు తొడుక్కుని ఎగురు!



గిరి ప్రసాద్ చెలమల్లు
94933 88201

